# డబ్ల్యూటీటీ టోర్నీలో శ్రీజ


## నేరుగా అర్హత సాధించిన రాష్ట్ర యువ ప్యాడ్లర్



గోవా: డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్ టోర్నీకి తెలంగాణ యువ ప్యాడ్లర్ ఆకుల శ్రీజ నేరుగా అర్హత సాధించింది. గోవా వేదికగా ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు జరుగనున్న టోర్నీలో శ్రీజ బరిలోకి దిగనుంది. ఈ యువ ప్యాడ్లర్‌తో పాటు మనికా బాత్రా, హర్మన్‌ప్రీత్ దేశాయ్ భారత్ తరపున సింగిల్స్‌లో ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రస్తుతం టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో 89వ ర్యాంక్‌లో ఉన్న శ్రీజ..సింగిల్స్ మెయిన్ డ్రాలో చోటు దక్కించుకుంది. మరోవైపు ప్రపంచ ఐదో ర్యాంకర్ హ్యూగో కాల్డెనో సింగిల్స్‌లో టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతున్నాడు. యూత్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత అయిన ఈ బ్రెజిల్ ప్యాడ్లర్ డబ్ల్యూటీటీ టోర్నీలో సత్తాచాటేందుకు తహతహలాడుతున్నాడు. భారత్ నుంచి మిక్స్‌డ్ డబుల్స్‌లో మనిక, సాతియాన్ జ్ఞానశేఖరన్, మహిళల డబుల్స్‌లో ఐహిక ముఖర్జీ, సుతీర్థ ముఖర్జీ, పురుషుల డబుల్స్‌లో సాతియాన్, శరత్ కమల్, మానుశ్ షా, మానవ్ థక్కర్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

# హైదరాబాద్ శుభారంభం

**రంజీ ట్రోఫీలో నాగాలాండ్‌పై విజయం**



హైదరాబాద్, ఆట ప్రతినిధి: దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నీ రంజీ ట్రోఫీలో హైదరాబాద్ శుభారంభం చేసింది. హైదరాబాద్ ఇన్నింగ్స్ 194 పరుగుల తేడాతో నాగాలాండ్‌ను చిత్తుచేసింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన హైదరాబాద్.. కేవలం రెండు రోజుల్లోనే మ్యాచ్‌ను ముగించి అదుర్స్ అనిపించింది. మొదట హైదరాబాద్ 474/5 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా.. నాగాలాండ్ కనీస ప్రతిఘటన కనబర్చలేకపోయింది. ఓవర్‌నైట్ స్కోరు 35/1తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన నాగాలాండ్ 153 పరుగులకు ఆలౌటైంది. తనయ్ త్యాగరాజన్ 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఫాలో ఆన్ ఆడిన నాగాలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 127 పరుగులకు కుప్పకూలింది.

# *వంట వాళ్లను వెంట పెట్టుకొని..*

*లండన్: ఈ నెలఖరులో భారత పర్యటనకు రానున్న ఇంగ్లండ్ క్రికెట్ జట్టు.. తమ వెంట ప్రత్యేక వంటవాళ్లను తెచ్చుకోనుంది. ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కావడంతో.. భారత్‌లో ఏడు వారాలకు పైగా ఉండాల్సి రావడంతో టీమ్‌తో పాటు చెఫ్‌ను కూడా తెచ్చుకుంటున్నట్లు ఆ దేశ మీడియా వెల్లడించింది. ఈ నెల 25 నుంచి హైదరాబాద్‌లో జరగనున్న తొలి టెస్టుతో ఇంగ్లండ్ పర్యటన ప్రారంభం కానుంది. 2012 తర్వాత ఇంగ్లిష్ జట్టు భారత్‌లో టెస్టు సిరీస్ విజయం సాధించలేకపోయిన విషయం తెలిసిందే. గత పర్యటనలో తొలి మ్యాచ్ నెగ్గిన ఇంగ్లండ్.. ఆ తర్వాత వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడి సిరీస్ కోల్పోయింది. ఈ సారి అలాంటి తప్పిదాలు జరగకుండా సుదీర్ఘ పర్యటనలో ప్లేయర్లు అస్వస్థత, అనారోగ్యాలకు గురికాకుండా తమ వెంట ప్రత్యేక వంటగాడిని తెచ్చుకుంటున్నట్లు సమాచారం. ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్లబ్ మాంచెస్టర్ యునైటెడ్ చెఫ్‌ను భారత్‌కు తెస్తున్నట్లు అక్కడి పత్రికలు పేర్కొన్నాయి. గతంలో పాకిస్థాన్ పర్యటన సందర్భంగానూ ఇంగ్లండ్ ఇలా ప్రత్యేక వంటవాళ్లను వెంట తీసుకెళ్లింది.*

# వార్నర్‌కు విజయంతో వీడ్కోలు

**చివరి టెస్టులో పాకిస్థాన్‌పై ఆసీస్ గెలుపు • 3-0తో సిరీస్ కైవసం**

సిడ్నీ: టెస్టు కెరీర్‌లో ఆడిన చివరి టెస్టులో ఆస్ట్రేలియా విధ్వంసక ఓపెనర్ డేవిడ్ వార్నర్ (57) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఫలితంగా పాకిస్థాన్‌తో జరిగిన మూడో టెస్టులో ఆసీస్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 68/7తో శనివారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్థాన్ 115 పరుగులకు ఆలౌటైంది. అయూబ్ (33) టాప్ స్కోరర్ కాగా.. కంగారూ బౌలర్లలో హాజిల్‌వుడ్ 4, లియాన్ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం 130 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ 2 వికెట్లు కోల్పోయి టార్గెట్ చేజ్ చేసింది. వార్నర్‌తో పాటు లబుషేన్ (62 నాటౌట్) అర్ధశతకంతో రాణించాడు. పాక్ బౌలర్లలో సాజిద్ రెండు వికెట్లు పడగొట్టాడు. జమాల్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', కమిన్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి.



**వార్నర్ కోసం వేలాదిగా..**

తన సొంత మైదానం సిడ్నీలో చివరి టెస్టు ఆడిన వార్నర్‌కు అభిమానులు అనూహ్య రీతిలో వీడ్కోలు పలికారు. మ్యాచ్ ముగిసిన అనంతరం వేలాది మంది అభిమానులు వార్నర్‌ను అభినందించేందుకు మైదానంలోకి వచ్చారు. కెరీర్‌లో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపాడు.

హైదరాబాద్ వేదికగా జరగాల్సిన ప్రతిష్ఠాత్మక ఫార్ములా-ఈ రేసింగ్ చాంపియన్‌షిప్ అధికారికంగా రద్దయ్యింది. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పందాన్ని ఉల్లంఘించిన కారణంగా రేసింగ్‌ను రద్దు చేస్తున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆటోమొబైల్(ఎఫ్ఐఏ) శనివారం ప్రకటించింది. నిరుడు అక్టోబర్‌లో కుదిరిన ఒప్పందాన్ని ప్రభుత్వం కొనసాగించేందుకు సమ్మతించని కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని స్పష్టం చేసింది. ఈ కారణంతో పదో సీజన్ ఫార్ములా-ఈ చాంపియన్‌షిప్ నుంచి హైదరాబాద్ తప్పుకున్నట్టు అయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఇది ప్రభుత్వ తిరోగమన చర్య అని విమర్శించారు.



# ఫార్ములా-ఈ రేసు రద్దు

## ఏబీబీ ఎఫ్ఐఏ అధికారిక ప్రకటన

**రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం ఉల్లంఘన • పదో సీజన్ నుంచి హైదరాబాద్ ఔట్ • కాంగ్రెస్ ప్రభుత్వ తిరోగమన చర్య: కేటీఆర్**

సిటీబ్యూరో,జనవరి 6 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ వేదికగా జరగాల్సిన ఫార్ములా-ఈ రేసును రద్దు చేస్తున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆటోమొబైల్(ఎఫ్ఐఏ) శనివారం అధికారికంగా ప్రకటించింది. వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 10వ తేదీన ఫార్ములా-10 సీజన్‌కు హైదరాబాద్ ఆతిథ్యమివ్వాల్సింది. ఇందుకోసం గతేడాది అక్టోబర్ 30న బీఆర్ఎస్ ప్రభుత్వంతో ఫార్ములా-ఈ ప్రతినిధులు ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడటంతో సీన్ పూర్తిగా మారిపోయింది. గతేడాది ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఫార్ములా-ఈ పోటీలు దేశం దృష్టిని ఆకర్షించాయి. దేశంలో తొలిసారి ఇలాంటి పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వడంతో సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు, సెలెబ్రిటీలు పెద్ద ఎత్తును తరలివచ్చారు. గతేడాది లాగే ఈసారి జరుగుతుందని ఆశిస్తున్న తరుణంలో రేసింగ్ అభిమానులను తీవ్ర నిరాశ కల్గించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించింది. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఒప్పందాన్ని ఉల్లంఘించిన కారణంగా తాము రేసింగ్‌ను రద్దు చేస్తున్నట్లు ఎఫ్ఐఏ స్పష్టం చేసింది. గతంలో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించేందుకు విముఖత ప్రదర్శించిన కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఒక ప్రకటనలో పేర్కొంటూ పురపాలక శాఖకు నోటీసులు ఇచ్చింది. దీంతో ఆతిథ్య హోదా నుంచి హైదరాబాద్‌ను తప్పిస్తూ షెడ్యూల్ ప్రకటించారు. రేసింగ్ రద్దు వలన ప్రముఖ నగరాలైన టోక్యో, షాంఘై, బెర్లిన్, మొనాకో, లండన్ సరసన నిలిచే అవకాశాన్ని హైదరాబాద్ కోల్పోయినట్లయింది. ఈ నెల 13 నుంచి హాన్‌కూక్(మెక్సికో) నుంచి ఫార్ములా-ఈ సీజన్ అధికారికంగా ప్రారంభం కాబోతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది ప్రభుత్వ తిరోగమన చర్య అంటూ ఆయన వ్యాఖ్యానించారు.రేసింగ్ అభిమానులు ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు.

### మా కృషి వృథా అయ్యింది: కేటీఆర్



ఫార్ములా-ఈ రేసింగ్ రద్దు కావడం కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వ తిరోగమన చర్యే. హైదరాబాద్‌లో నిర్వహించే ఈ-ప్రిక్స్ వంటి ఈవెంట్‌లు ప్రపంచ వ్యాప్తంగా మన నగరం, దేశం యొక్క బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుతాయి. భారతదేశానికి మొదటి సారిగా ఫార్ములా-ఈ తీసుకురావడానికి మేము చాలా కృషి, సమయాన్ని వెచ్చించాం. ప్రపంచంలో హైదరాబాద్‌ను ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యస్థానంగా చేయడానికి ఎలక్ట్రిక్ వాహనాల తయారీ రంగంలో ఉన్న ఔత్సాహికులను, స్టార్టప్‌లను ఆకర్షించేలా పలు కార్యక్రమాలను నిర్వహించాం. అందులో భాగంగానే వారం రోజుల పాటు ఈవీ సమ్మిట్‌ను కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించింది. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని సమర్థంగా వినియోగించేందుకు అవసరమైన వ్యవస్థలు అభివృద్ధి చెందాలంటే ఇలాంటి కార్యక్రమాలను మన రాష్ట్రానికి అత్యవసరమని గుర్తించిన ప్రభుత్వం ఆ దిశగా పటిష్ఠమైన చర్యలు తీసుకుంది. సస్టెయినబుల్ మొబిలిటీ సొల్యూషన్స్‌కు కేంద్రంగా రాష్ట్రాన్ని ప్రమోట్ చేయడానికి కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ మొబిలిటీ వ్యాలీని సైతం ప్రారంభించింది.

### సామాజిక మాధ్యమాల్లో అభిప్రాయాలు...

హైదరాబాద్‌లో రేసులను నిర్వహించడం చాలా పెద్ద విషయం. ఎందుకంటే ఎలక్ట్రిక్ కార్లను ఉపయోగించడం గురించి మంచి విషయాలు తెలుసుకునేందుకు దోహదపడింది. ఈ ప్రతిష్ఠాత్మక చాంపియన్‌షిప్ గురించి పాలక ప్రభుత్వం చిన్న చూపు చూడడం బాధాకరం. - సామ్రాట్.

భారతదేశంలో 2024లో జరిగే ఏకైక అధికారిక ఎఫ్ఐఎ వరల్డ్ చాంపియన్‌షిప్ ఈవెంట్ హైదరాబాద్ ఈ-ప్రిక్స్. గతేడాది కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఈ పోటీలను ఇక్కడ నిర్వహించడంతో హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.650 కోట్ల వృద్ధి సాధించింది. - విష్ణువర్ధన్‌రెడ్డి.

భారత్‌లో మోటార్ స్పోర్ట్స్ అభిమానులను తీవ్ర నిరుత్సాహానికి గురిచేసే వార్త ఇది. ప్రతిష్ఠాత్మక ఫార్ములా-ఈ చాంపియన్‌షిప్ నిర్వహణ అనేది హైదరాబాద్‌తో పాటు దేశానికి ఎంతో గర్వకారణం.



- అల్బర్టో లాంగో ఫార్ములా-ఈ కోఫౌండర్

హైదరాబాద్‌కు ఫార్ములా-ఈ పోటీలకు తిరిగి తీసుకొచ్చేందుకు చాలా వరకు ప్రయత్నాలు చేశాం. కానీ తెలంగాణ ప్రభుత్వ నిర్ణయంతో ఫార్ములా-ఈ నిర్వహణకు అవకాశం లేకపోవడం నిరాశ కల్గించింది.



-అక్బర్ ఇబ్రహీం, ఎఫ్ఎంఎస్‌సీఐ అధ్యక్షుడు

'గతేడాది విజయవంతంగా నిర్వహించిన ఫార్ములా-ఈ చాంపియన్‌షిప్‌ను తిరిగి కొనసాగించడంలో విఫలమయ్యాం. రేసింగ్‌తో ఈ ప్రాంతానికి దాదాపు రూ.650 కోట్ల ఆదాయాన్ని సమకూర్చాం. దీనికి తోడు భారత ప్రధాన భాగస్వాములైన మహీంద్రా, టాటా కమ్యూనికేషన్స్‌ను నిరాశపరిచాం. హైదరాబాద్ రేసింగ్ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాల ఆవశ్యకతను పెంపొందిచేందుకు అవకాశం ఉండేది. ప్రస్తుతం ఇంధన వాహనాలతో ప్రజల ఆరోగ్యంతో పాటు వాతావరణం దెబ్బ తింటున్నది.



-జెఫ్ డాడ్స్, ఫార్ములా-ఈ సీఈవో

# ట్రేడర్లపై పెను భారం

వాణిజ్య

- కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలి
- ఎర్ర సముద్ర సంక్షోభంపై జీటీఆర్ఐ



న్యూఢిల్లీ, జనవరి 6: ఎర్ర సముద్ర సంక్షోభం ముదిరేకొద్దీ వర్తక, వాణిజ్యంపై పెను భారం పడే వీలుందని గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) శనివారం ఓ నివేదికలో ఆందోళన వ్యక్తం చేసింది. ఎగుమతిదారులకు షిప్పింగ్, ఇన్సూరెన్స్ వ్యయం పెరుగుతాయన్నది. అందుకే భారతీయ ఎగుమతిదారులకు ఆర్థిక మద్దతును అందించడంపై కేంద్ర ప్రభుత్వం తప్పక దృష్టి సారించాలని అభిప్రాయపడింది. ఈ సంక్షోభం.. షిప్పింగ్ ఖర్చులను 60 శాతం వరకు, బీమా ప్రీమియంను 20 శాతం వరకు పెంచేలా ఉందన్నది. ఈ క్రమంలోనే ప్రస్తుత పరిస్థితులను చూస్తే.. ఇప్పుడప్పుడే ఈ సమస్య తీరేలా లేదని, దీర్ఘకాలిక రవాణా ఇబ్బందులను భారత్ ఎదుర్కోక తప్పదంటూ.. అందుకు సిద్ధంగా ఉండాల్సిందేనని జీటీఆర్ఐ వ్యాఖ్యానించడం గమనార్హం. 'వాణిజ్య నౌకలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులు రవాణా ఖర్చుల్ని మరింతగా పెంచేస్తున్నాయి. సరుకులు సకాలంలో డెలివరీ కావడం లేదు. దీనివల్ల ఎగుమతిదారుల లాభాలు పడిపోతున్నాయి' అని జీటీఆర్ఐ పేర్కొన్నది.

**ముడి చమురు దిగుమతులపై..**

ముడి చమురు దిగుమతుల రక్షణార్థం ఒమన్, జిబౌటి వంటి సంఘర్షణలకు లోనవుతున్న ప్రాంతాలకు వెలుపల ఉండే పోర్టులపై దృష్టి సారించాలని తమ నివేదికలో జీటీఆర్ఐ సూచించింది. అలాగే పశ్చిమ ఆఫ్రికా, అమెరికా, మెడిటరేనియన్ తదితర ప్రాంతాల నుంచి ముడి చమురు దిగుమతుల్ని వైవిధ్యపర్చడం కూడా ముఖ్యమేనని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలోనే వాణిజ్య అవాంతరాలకు గురవుతున్న భారతీయ సంస్థలకు ఆర్థిక సాయం, బీమా పథకాలను కల్పించాలని కోరింది.



## ఏథర్ ఎనర్జీ సరికొత్త స్కూటర్

**ధర రూ.1.89 లక్షలు**

న్యూఢిల్లీ, జనవరి 6: ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ మరో కొత్త మాడల్‌ను మార్కెట్‌కు పరిచయం చేసింది. ఈ రంగంలోకి అడుగుపెట్టి పదేండ్లు పూర్తైన సందర్భంగా ప్రత్యేక ఎడిషన్‌గా 450 అపెక్స్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.1.89 లక్షల ధర కలిగిన ఈ స్కూటర్ కోసం ముందస్తు బుకింగ్‌లు ప్రారంభించినట్టు కంపెనీ కో-ఫౌండర్, సీఈవో తరుణ్ మెహతా తెలిపారు. కేవలం 2.9 సెకండ్లలోనే 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ స్కూటర్‌ను గంటకు 100 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 200 సీసీ సామర్థ్యంతో తీర్చిదిద్దిన ఈ స్కూటర్ పూర్తి స్థాయి బ్యాటరీ చార్జింగ్‌తో 157 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఈ స్కూటర్‌పై ఐదేండ్లు లేదా 60 వేల కిలోమీటర్ల బ్యాటరీ వ్యారెంటీ కూడా సంస్థ కల్పిస్తున్నది.

# నాలుగు కొత్త గనులకు శ్రీకారం

- త్వరలోనే భట్టి సారథ్యంలో ఒడిశాకు
- సింగరేణి సీఎండీ బలరామ్

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): బొగ్గు ఉత్పత్తిలో అగ్రగామి సంస్థల్లో ఒకటైనా సింగరేణి స్పీడ్ పెంచింది. ఈ ఏడాది కొత్తగా నాలుగు గనుల నుంచి బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించాలనుకుంటున్నట్టు కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరామ్ తెలిపారు. శనివారం సింగరేణి భవన్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో కొత్త గనులపై పురోగతిపై అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు. సరైన ప్రణాళికలతో అధికారులు ముందుకెళ్లాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్ని ప్రాంతాల జీఎంలకు సూచించారు. ఒడిశా రాష్ట్రంలో సంస్థ చేపట్టిన నైనీ బొగ్గు బ్లాక్ పనులు శరవేగంగా సాగుతున్నాయని, ఈ గనులకు సంబంధించి చివరి దశ అనుమతుల కోసం అక్కడి రాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇందుకోసం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకొంటున్నారని, ఈ నెల మూడోవారంలో ఒడిశా ముఖ్యమంత్రితో చర్చించడానికి మంత్రి ముందుకొచ్చినట్టు తెలిపారు. దీంతో ఈ బ్లాక్‌నకు సంబంధించి చివరి అనుమతులు వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు. దీంతో ఈ ఏడాది కొత్తగా అందుబాటులోకి రానున్న నైనీ బొగ్గు బ్లాక్‌లో కనీసంగా ఏడాదికి 60 లక్షల టన్నుల బొగ్గుతోపాటు కొత్తగూడెం ఏరియాలోని వీకే ఓపెన్ కాస్ట్ గనిలో 30 లక్షల టన్నులు, ఇల్లెందు ఏరియాలో 10 లక్షల టన్నులు, బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఓపెన్ కాస్ట్ గనిలో 4 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

**సోలార్‌పై సింగరేణి ప్రత్యేక దృష్టి**

దేశవ్యాప్తంగా సౌర విద్యుత్ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సింగరేణి సిద్ధమవుతున్నది. సంప్రదాయేతర ఇంధన వనరులను ప్రోత్సహించడంలో భాగంగా ఇతర రాష్ట్రాల్లో జాయింట్ వెంచర్‌తో సోలార్ ప్రాజెక్టులను చేపట్టేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఉన్నతాధికారులకు బలరామ్ సూచించారు. ముఖ్యంగా రాజస్థాన్, గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఉన్న కమర్షియల్ సోలార్ ప్రాజెక్టులపై అధ్యయనం చేసి, తుది నివేదికను సమర్పించాలని చెప్పారు. మరోవైపు, సంస్థ నిర్దేశించుకున్న 300 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తిలో ఇంకా 76 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ను మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే రెండో దశలో భాగంగా 232 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటునకు సంబంధించి టెండర్ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. థర్మల్ ప్లాంట్ ఆవరణలో ఏర్పాటు చేయనున్న 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్‌నకు సంబంధించి టెండర్ ప్రక్రియతోపాటు రూ.700 కోట్లతో చేపడుతున్న ఫ్లూ గ్యాస్ డిసల్ఫరైజేషన్ ప్లాంట్ పనులను త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉన్నదని వ్యాఖ్యానించారు.




# ఫార్మా కంపెనీలకు కొత్త ప్రమాణాలు

- నోటిఫికేషన్ జారీచేసిన కేంద్రం


న్యూఢిల్లీ, జనవరి 6: భారత్‌లో ఉత్పత్తయిన ఔషధాల్ని వినియోగించిన కొన్ని దేశాల్లో మరణాలు సంభవించిన నేపథ్యంలో ఫార్మాస్యూటికల్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం కొత్త తయారీ ప్రమాణాల్ని నిర్దేశించింది. ఉజ్జబెకిస్థాన్, గాంబియా, కెమరూన్ దేశాల్లో 141 మంది పిల్లలు మృత్యువాత పడటానికి భారత్‌లో తయారైన దగ్గుమందులే కారణమంటూ డబ్ల్యూహెచ్‌వో, ఇతర ఆరోగ్య నియంత్రణా సంస్థలు ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది నుంచి కొత్త ప్రమాణాలను పాటించాల్సిందేనని ఆదేశిస్తూ కేంద్ర ఆరోగ్య శాఖ ఒక నోటిఫికేషన్ జారీచేసింది. ఫార్మా ఉత్పత్తుల తయారీకి వాడుతున్న ముడిపదార్థాలను ఏ మాత్రం పరీక్షించడం లేదని తాము 2022 డిసెంబర్ నుంచి 162 ఔషధ ప్లాంట్లలో జరిపిన తనిఖీల్లో తేలినట్టు మంత్రిత్వ శాఖ తెలిపింది. దేశంలో ఉన్న దాదాపు 8,500 చిన్న ఔషధ కంపెనీల్లో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్‌వో) నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తున్నవి అతికొద్దిగానే ఉన్నాయని వెల్లడించింది. కొత్త ప్రమాణాల్ని పెద్ద సంస్థలు ఆరు నెలల్లోగా, చిన్న కంపెనీలు 12 నెలల్లోగా పాటించాలని ఆదేశించింది.

**వివరాలు..**

- ఫార్మా ఉత్పత్తుల నాణ్యతకు పూర్తి బాధ్యత తయారీదారే తీసుకోవాలి. వినియోగానికి ఫిట్‌గా ఉన్నాయని, లైసెన్సు నిబంధనల్ని అనుసరించి తయారైనట్టు హామీ ఇవ్వాలి.
- ముడిపదార్థాలపై చేసే పరీక్షల్లో 'సంతృప్తికరమైన ఫలితాలు' వచ్చిన తర్వాతే తుది ఫార్మా ఉత్పత్తిని మార్కెట్లోకి తీసుకురావాలని కంపెనీలను ఆదేశించింది.
- అలాగే పదేపదే టెస్టింగ్ చేయడానికి, బ్యాచ్ వెరిఫికేషన్‌కు..తయారీ మధ్యలో తీసే శాంపుల్స్, తుది ఉత్పత్తుల శాంపుల్స్‌ను తగినన్ని అందుబాటులో ఉంచాలన్నది.

# జోస్ ఆలుక్కాస్ వార్షికోత్సవ ఆఫర్లు

హైదరాబాద్, జనవరి 6: ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ జోస్ ఆలుక్కాస్ వార్షికోత్సవ ఆఫర్లు ప్రకటించింది. ఈ ఆఫర్లలో భాగంగా ఆకర్షణీయమైన ధరల తగ్గింపుతో పాటు బహుమతులు, బంగారం, వజ్రాలు, ప్లాటినం, ఆభరణాలను తగ్గింపు ధరకే విక్రయిస్తున్నది. దీంట్లోభాగంగా రూ.50 వేలకు పైబడిన బంగారు ఆభరణాల కొనుగోలుపై ఒక బంగారు నాణేన్ని అందిస్తున్న సంస్థ..వజ్రాలపై 20 శాతం, ప్లాటినం ఆభరణాలపై 7 శాతం తగ్గింపు ధరకే విక్రయిస్తున్నట్లు తెలిపింది. ఈ ప్రత్యేక ఆఫర్లు ఈ నెల 6 నుంచి హైదరాబాద్‌లో ఉన్న మూడు షోరూంలతోపాటు నిజామాబాద్, విజయవాడ, విశాఖపట్నం షోరూంలలో ఈ ఆఫర్లు అందుబాటులో ఉంచింది. ఈ సందర్భంగా జోస్ ఆలుక్కాస్ చైర్మన్ జోస్ ఆలుక్కా మాట్లాడుతూ..దక్షిణాదిలో తన వ్యాపార వృద్ధికి తెలంగాణ, ఏపీలు గణనీయమైన భాగస్వామ్యాన్ని అందించాయని, ఈ షోరూంలలో ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉంచినట్టు చెప్పారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.